క్లుప్తంగా

వరినాట్లు వేసిన ఆర్డీఓ



కాకర్ల(తిరువూరురూరల్): కాకర్ల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. తిరువూరు ఆర్డీఓ కె. మాధురి రైతులతో కలిసి వరినాట్లు వేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద రైతులకు ఉద్యాన పంటల సాగు ఆవశ్యకత, సేంద్రియ ఎరువుల వాడకం అంశాలపై అవగాహన కల్పించారు. వరిసాగులో మెలకువలను వ్యవసాయాధికారి పద్మ వివరించారు. తక్కువ ఖర్చుతో పంటల సాగు, నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యంపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. తహసీల్దారు ఉదయభాస్కర్, ఎంపీడీఓ రవిబాబు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన అవసరం



ముసునూరు: వ్యక్తిగత పరిశుభ్రతపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి షకీనా ఇవాంజిలిన్ అన్నారు. బుధవారం ముసునూరులోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆమె పరిశీలించారు. బాలికల విద్య, పరిశుభ్రతపై వార్డెన్ హిమబిందును వివరాలు అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్, డార్మెటరీ, రీడింగ్ రూం, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. సూపర్‌వైజర్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్‌కు కొండపల్లి సీపీఎం నాయకులు బుధవారం నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, నాయకులతో కలసి అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ కేరళ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా అచ్యుతానందన్ విశిష్ట సేవలు అందించారని చెప్పారు. శ్రమజీవుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారని వివరించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, జేవీవీ జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్, పట్టణ కార్యదర్శి ఎం.మహేష్, పార్వతి, బేబీ సరోజినీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల పరిశీలన



విస్సన్నపేట: కృత్రిమ కొరత పేరుతో గ్రామాల్లో లైసెన్సు లేనివారు యూరియా విక్రయిస్తే కేసులు పెడతామని ఏడీఏ శశికళ హెచ్చరించారు. ఎరువుల దుకాణాలను బుధవారం ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పట్టాదారు పాసుపుస్తకం నకలు కాపీ తీసుకువచ్చి ఎరువులు తీసుకోవాలన్నారు. యూరియా అమ్మకాలపై ఎరువుల దుకాణాలలో గ్రామ వ్యవసాయ సహాయకులతో నిఘా, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషి

ముసునూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని ఆ శాఖ జిల్లా కార్యదర్శి అనురాధ అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు పద్మ కిశోర్, ప్రధాన కార్యదర్శి గుడిమళ్ల రాంబాబు, జిల్లా కౌన్సిలర్ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గంలో పలువురికి చోటు

నూజివీడు: బీజేపీ ఏలూరు జిల్లా నూతన కార్యవర్గంలో నూజివీడు నియోజకవర్గంలోని పలువురికి స్థానం లభించిందని సీనియర్ నాయకలు మల్లెపూడి రాజశేఖర్ తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు బోను అప్పారావు, శివరాజు వసుంధరదేవి, కోశాధికారిగా మాటూరి రవికాంత్, కార్యవర్గ సభ్యులుగా ద్రోణంరాజు శ్రీనివాసరావు (చాట్రాయి), అనగాని రాంబాబు (ముసునూరు), రాయపాటి లీలా విజయ జ్యోతి (నూజివీడు) నియమితులయ్యారు.

నేడు గంజాయికి వ్యతిరేకంగా ర్యాలీ

తిరువూరు: గంజాయి నుంచి యువతను కాపాడాలని కోరుతూ తిరువూరులో గురువారం ఉదయం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ జరుగుతుందని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 9 గంటలకు బైపాస్ రోడ్డు వినాయక దేవాలయం నుంచి రాజుపేట పొట్టిశ్రీరాములు విగ్రహం వరకు జరిగే ప్రదర్శనలో యువకులు, మహిళలు పాల్గొనాలని ప్రకటనలో పేర్కొన్నారు.

ఆడబిడ్డ నిధి అటకెక్కినట్లేనా..

- 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1,500 ఇస్తామని కూటమి నేతల హామీ
- అధికారం చేపట్టి 13 నెలలు అవుతున్నా అందని లబ్ధి
- మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై ఆగ్రహం
- పథకం అమలు కోసం ఎదురు చూస్తున్న మహిళలు



నూజివీడు: 18 ఏళ్లు నిండిన మహిళలు ఎంతమంది ఉంటే అంతమందికి నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 13 నెలలు అవుతున్నా ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ప్రభుత్వం ఎప్పుడు ఇస్తుందా? అని అర్హులైన యువతులు, మహిళలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే 14 నెలలు గడిచిపోవడంతో ఒక్కొక్క మహిళకు రాష్ట్ర ప్రభుత్వం రూ.19,500 బాకీ పడింది. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అక్కాచెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750 చొప్పున చెల్లించి వారి ఆర్థిక పురోగతికి తోడ్పాటు అందించారు. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆడబిడ్డ నిధి అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని ఆయన చేసిన వ్యాఖ్యలపై మండిపడుతున్నారు. రాష్ట్రానికి, మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ప్రశ్నిస్తున్నారు. కూటమి పాలకులు నమ్మించి మోసం చేశారని మహిళలు వాపోతున్నారు.

ప్రస్తుతం మేనిఫెస్టో అమలే లేదు

ప్రస్తుత ప్రభుత్వంలో మేనిఫెస్టో అమలే లేదు. అధికారం కోసం అలవికాని హామీలతో నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడంపై ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. ప్రజలకు హామీ ఇచ్చారంటే అమలు చేసి చూపాలే గాని, ఇలా కల్లబొల్లి కబుర్లు చెప్పి కాలం వెళ్లబుచ్చడం పాలకుల లక్షణం కాదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే అమలు చేసిన ఏ పథకం చూసినా అరకొరగానే అమలవుతున్నాయని వాపోతున్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం అన్నారే గాని మొదటి సారి బుక్ చేసిన వాటికే కొంతమందికి డబ్బులు పడ్డాయని, రెండోసారి బుక్ చేసిన వారికి డబ్బులు పడటం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.130.60 కోట్ల పంపిణీ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 'వైఎస్సార్ చేయూత' పథకం కింద నియోజకవర్గ వ్యాప్తంగా ఐదేళ్లలో రూ.130.60 కోట్లను పేద, మధ్య తరగతి మహిళల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఈ నగదుతో మహిళలు వేడినీళ్లకు చన్నీళ్లు తోడు చందంగా కుటుంబ అవసరాలకు, చిన్న, చిన్న వ్యాపారాలకు ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పథకాలను అమలు చేసి ప్రజల గడప వద్దకే తీసుకెళ్లి అందించారు.

నెలకు రూ.1,500 హామీని అమలు చేయాలి



ఎన్నికల ముందు 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. ప్రభుత్వం ఏర్పాటై 13 నెలలు గడిచినా ఇంతవరకు ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం ప్రజలను మోసం చేయడమే. పథకాన్ని అమలు చేసి బకాయి మొత్తాన్ని కూడా విడుదల చేయాలి.

– పాలేటి సుభాష్ చంద్రబోస్, సీపీఎం మండల కార్యదర్శి, నూజివీడు

మహిళలను మోసం చేసినట్లే



కూటమి పాలకులు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలి. ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తరువాత అమలు చేయకుండా తప్పించుకునేందుకు సాకులు వెదకడం సమంజసం కాదు. హామీలు ఇచ్చేటప్పుడే అమలుకు సాధ్యమవుతుందా, లేదా అనేది ఆలోచించుకోవాలి. అమలు చేయకపోతే మహిళలను మోసం చేసినట్లే.

– షేక్ రజియాబేగం, ఒకటో వార్డు కౌన్సిలర్

అమ్మవార్లకు ఆషాఢం సారె



చాట్రాయి: చనుబండ గ్రామంలో అమ్మవార్లకు బుధవారం కోనేరు అభయాంజనేయ స్వామి భక్తులు ఆషాఢ మాసం సారె సమర్పించారు. గ్రామంలోని ఎల్లమ్మతల్లి, కోదండ రామాలయంలో సీతమ్మ, సత్యనారాయణ స్వామి ఆలయంలో పార్వతి అమ్మవార్లకు మేళతాళాలతో పూలు, చీరలు, గాజులు, పసుపు కుంకుమ, సారె సమర్పించారు. కోదండ రామాలయం వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవారు



మైలవరం: స్థానిక భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో చైర్మన్ ఎస్వీ సుధాకర్ ఆధ్వర్యంలో అమ్మవారిని బుధవారం శాకంబరి దేవిగా అలంకరించారు. లలితా పారాయణం చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

బుడమేరుకు పెరిగిన వరద ప్రవాహం



కందులపాడు వద్ద బుడమేరు వరద ప్రవాహం



సురక్షిత ప్రాంతానికి వెళుతున్న మైలవరంలోని బాలయోగి నగర్ వాసులు

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొండవాగు పొంగి బుధవారం ఉదయం బుడమేరుకు వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. జి.కొండూరు మండల పరిధి కందులపాడు, హెచ్.ముత్యాలంపాడు గ్రామాల మధ్య బుడమేరు చప్టాపై నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. ఇక్కడ పక్కనే ఉన్న పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో వరద ప్రవాహానికి కూలే ప్రమాదం ఉన్నందున ఈ వంతెనపై కూడా రాకపోకలను ఆపేశారు. వరద ప్రవాహం మధ్యాహ్నం తర్వాత క్రమేపీ తగ్గుముఖం పట్టడంతో సాయంత్రం నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. మరో వైపు పట్టిసీమ మోటార్లను ఆపినప్పటికీ నీటి ప్రవాహం కొనసాగుతుండడం, బుడమేరుకు వరద ప్రవాహం ఒక్కసారిగా రావడంతో వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద బుధవారం మధ్యాహ్నం నీటి మట్టం 5.4 అడుగులకు చేరి సాయంత్రానికి 5.2 అడుగులకు తగ్గింది. బుధవారం రాత్రి మరలా వర్షం కొనసాగితే బుడమేరకు వరద పోటెత్తే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. హెడ్ రెగ్యులేటర్ వద్ద మరమ్మతులు కొనసాగుతుండటంతో ఒకవేళ వరద ఉధృతి పెరిగితే మ్యాన్యువల్‌గా గేట్లను ఎత్తేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని బుడమేరు ఏఈ వెంకటేశ్ తెలిపారు.

నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

మైలవరం: మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో మైలవరంలోని పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వర్షంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. మైలవరంలోని బాలయోగి నగర్, తారక రామా నగర్, చిన్న దళితవాడలో వర్షం నీరు ఇళ్లల్లోకి ప్రవేశించడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. బాలయోగి నగర్‌లో కొందరు ఇళ్లు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు, బంధువుల ఇళ్లకు చేరుకున్నారు. బాలయోగి నగర్ జలదిగ్బంధంలో చిక్కుకుంది. వెల్వడం, తిరువూరు రోడ్డులోని పంట పొలాలు ముంపునకు గురయ్యాయి.

అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలి



డెప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆగిరిపల్లి: సహజ వనరులైన మట్టి, గ్రావెల్‌ను మండలంలో కూటమి నాయకులు అక్రమంగా అమ్ముకుంటూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించి డెప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వీరబాబు మాట్లాడుతూ కూటమి నాయకులు అక్రమంగా కొత్త ఈదర సర్పంచ్ గొల్లవాని వాగు సమీప పొలంలో 5 వేల ట్రక్కుల మట్టిని నిల్వ చేశారన్నారు. ఈదులగూడెంలోని పెద్ద చెరువులో మట్టిని అక్రమంగా తవ్వి అక్కినేని పార్వతి పొలంలో సుమారు 3 వేల ట్రక్కుల మట్టిని నిల్వ చేశారని చెప్పారు. నూగొండపల్లిలోని పెద్దప్ప చెరువులో మట్టిని అక్రమంగా తవ్వి సుమారు పదివేల ట్రక్కుల మట్టిని నిల్వ చేసి విజయవాడ పరిసరాల్లోని ఇటుక బట్టీలకు తరలించ డానికి అక్రమార్కులు సిద్ధంగా ఉన్నారన్నారు. చొప్పరమెట్ల గ్రామ పరిధిలోని నెల్లిగట్టును, నూగొండపల్లిలోని నుగ్గట్టు, రాజవరంలోని కొండలను అక్రమార్కులు ఇష్టానుసారంగా తవ్వి గ్రావెల్‌ను లారీలలో విజయవాడకు రాత్రి పూట అక్రమంగా తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రెవెన్యూ అధికారుల ముందే ఈ తతంగం జరుగుతున్నా చోద్యం చూస్తున్నారే తప్ప అడ్డుకోవడం లేదని విమర్శించారు. అధికారులు స్పందించి మండలంలో కూటమి నాయకుల అక్రమ మైనింగ్‌ను అడ్డుకుని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మచ్చా హరిబాబు, నూజివీడు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు టి. పావన జ్యోతి సుజనా కుమారి, పార్టీ నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు ఈలప్రోలు సుబ్బయ్య, నాయకులు కందుల విక్రం, డీవీ రామారావు, కంబాల ప్రదీప్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి

ఇబ్రహీంపట్నం: రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి అన్నారు. కేతనకొండ, కోటికలపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గుతుందన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగంతో దుష్ఫలితాలు సంభవిస్తాయని చెప్పారు. నానో యూరియా, నానో డీఏపీ వాడాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ మౌనిష, తహసీల్దార్, కేతనకొండ సర్పంచి నళినీ ఆశాలత, ఉద్యాన అధికారి వేణుమాధవ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హసీనా, రైతులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు మేలు

జక్కంపూడి(విజయవాడరూరల్): అధిక ఆదాయాన్నిచ్చే ఉద్యాన పంటలను రైతులు సాగు చేసుకోవాలని విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య అన్నారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా సన్న, చిన్న కారు రైతులకు నూరు శాతం సబ్సిడీతో పండ్ల తోటల మొక్కలను అందజేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నానో యూరియా ఉపయోగాలను వివరించారు. అనంతరం వరి పొలాలను సందర్శించారు. వ్యవసాయ శాఖ ఏడీఏ బి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ బి.సుగుణ, ఎంపీడీఓ బి.విగ్గీస్, ఏఓ రఘురాం తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ చైతన్య

సమగ్ర నీటి యాజమాన్యంపై అవగాహన

చాట్రాయి: వరి సాగులో సమగ్ర నీటి యాజమాన్యంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని జనార్దనవరం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వరి నాట్లు వేసేటప్పుడు నీరు పలచగా ఉండాలని, ఎండలు ఎక్కువగా ఉంటే ఐదు సెంటీ మీటర్ల లోతు వరకు నీరు నిలవ గట్టాలని చెప్పారు. వరి మూన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బు కట్టేవరకు పొలంలో పలుచగా నీరు ఉండేలా చూసుకోవాలని సూచించారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళన

తిరువూరు: విద్యుత్ వినియోగదారులపై భారం మోపే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఎ.కొండూరు మండలం రామచంద్రాపురంలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలపై భారాన్ని మోపే రీతిలో సర్దుబాటు చార్జీల పేరుతో రూ.67 వేల కోట్లకు పైగా వ్యయంతో స్మార్టుమీటర్లను ఏర్పాటు చేస్తోందని సీపీఎం నాయకులు ఆళ్ల అమ్మిరెడ్డి, పంబి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఒక్కొక్క స్మార్ట్ మీటరు ఏర్పాటుకు రూ.13 వేలకు పైగా వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న ప్రభుత్వం వెంటనే ఈ విధానానికి స్వస్తి చెప్పకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. స్మార్టుమీటర్లకు వ్యతిరేకంగా వినియోగదారులకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

శివాలయంలో అన్నదానం

చాట్రాయి: జనార్దనవరం గ్రామంలోని జనార్దనేశ్వరుని ఆలయంలో బుధవారం అన్నదానం చేశారు. మాస శివరాత్రి సందర్భంగా 500 మందికి అన్నదానం చేశామని నిర్వాహకులు తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నూజివీడు: నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

మొర్సుమల్లిలో రోడ్లు ప్రారంభం

మైలవరం: మైలవరం మండలం మొర్సుమల్లి గ్రామంలో రూ.27.52 కోట్ల వ్యయంతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం ప్రారంభించారు. కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సారా విక్రేతపై కేసు నమోదు

చాట్రాయి: సారా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ భోగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోటపాడు గ్రామంలో సారా విక్రయాలపై దాడులు చేయగా గ్రామానికి చెందిన ఉబ్బల మహాలక్ష్మి ఐదు లీటర్ల సారా వదిలి పారిపోయిందని, ఆమెపై కేసు నమోదు చేశామని చెప్పారు.

రేపు కౌలు వేలం

జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామంలో సర్వే నెంబరు 163/1లోని 9.30 ఎకరాల భూమి కి ఈ నెల 25న బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్ బుధవారం తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కౌలు వేలంలో పాల్గొనదలచినవారు ముందుగా దరావతు కింద రూ. 10వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఆదర్శప్రాయులు ఆజాద్, తిలక్

జయంతి కార్యక్రమాల్లో నివాళి



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మైలవరం: భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో చంద్రశేఖర్ ఆజాద్, బాల గంగాధర తిలక్ పోరాట పటిమ ఎనలేనిదని, వారి జీవితాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర తిలక్ జయంతి కార్యక్రమం కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో వారి సేవలను కొనియాడారు. డాక్టర్ బి. రమేష్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి. శివహరిప్రసాద్, ఎస్.ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి కార్యక్రమం మద్దాయికుంట హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు ప్రధానోపాధ్యాయుడు దారపురెడ్డి భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్ఎం మాట్లాడుతూ లోకమాన్య బిరుదును పొంది స్వరాజ్యం నా జన్మహక్కు అని నినదించిన గొప్ప నాయకుడు బాలగంగాధర్ తిలక్ అని అన్నారు. బ్రిటిష్ వారిని గడగడలాడించిన వీరుడిగా చంద్రశేఖర్ ఆజాద్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పాగోలు నాగేంద్రరావు, జె. పద్మ, బి. జాన్సన్, టీటీ భాస్కర్, యు.శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఫెర్రి వద్ద కృష్ణానది వరద పరిస్థితిపై సూచనలు చేస్తున్న తహశీల్దార్ వెంకటేశ్వర్లు

ఇబ్రహీంపట్నం: వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కృష్ణా నదికి కొద్దిపాటి వరద ప్రవాహం చేరింది. ఈ నేపథ్యంలో తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు కృష్ణానది పరీవాహక ప్రాంతాలు, ఫెర్రి ఘాట్, పవిత్ర సంగమం వద్ద బుధవారం వరద పరిస్థితిని పరిశీలించారు. నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. ఇబ్రహీంపట్నం నుంచి గుంటూరు జిల్లా రాయపూడికి ప్రతి రోజూ ప్రయాణికులను చేరవేస్తున్న లాంచి ప్రయాణాన్ని నిలిపివేయాలని ఆదేశించారు. నది సమీపంలోని ఇళ్లల్లోని ప్రజలు, చిన లంక, పెదలంక ప్రాంత ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు అందించాలని ఆదేశించారు. ఆర్ఐ మనోజ్, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



తిరువూరు: గంపలగూడెం మండలం ఊటుకూరు కోదండ రామస్వామి దేవస్థానానికి ఓ భక్తుడు బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు. గ్రామానికి చెందిన రాజపురోహిత్ కిశోర్ ఈ నగదును ఆలయ కమిటీ అధ్యక్షుడు పద్మనాభుని సర్వేశ్వరరావుకు అందజేశారు. ఆలయ అర్చకులు రామకృష్ణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.